క్లుప్తంగా

రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్‌గా నరసింహ



నియామకపత్రం అందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్‌గా వైరాలజీ ప్రొఫెసర్ జి.నరసింహను నియమిస్తూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీన్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు నరసింహ కృతజ్ఞతలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి అర్బన్ : జిల్లాలో భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళి, టి.సుబ్రమణ్యం కోరారు. శనివారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా శెట్టిపల్లె పరిధిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వం సేకరించిన ప్లాటుదారులకు కార్పొరేషన్ ద్వారా వెంటనే లేఔట్లు వేసి స్థలాలు కేటాయించాలన్నారు. రేణిగుంట మండలం కరకంబాడిలో ఆక్రమిత భూములను విక్రయిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని సూచించారు. పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని విన్నవించారు. ఓజిలి, బీఎన్ కండ్రిగ మండలాల్లో ఆక్రమిత భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు.

బీసీ వర్గీకరణకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : రాష్ట్రంలో బీసీ వర్గీకరణ చేపట్టాలని అత్యంత వెనుకబడిన తరగతుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనుకొండ సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీ కులాలన్నింటికీ అందాల్సిన రిజర్వేషన్లు కేవలం 5,6 కులాల వారు మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎంబీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని త్వరలోనే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ ప్రకారం ఎంబీసీలకు సీట్లు కేటాయించాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమాఖ్య నేతలు కోదండరెడ్డి, ధర్మాచారి, బాబురాజేంద్రప్రసాద్, గంగులప్ప, నాగేశ్వరరావు, గజేంద్ర, జ్ఞానశేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్



ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న వీసీ

తిరుపతి సిటీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్ పర్సన్ ఎస్.విజయభారతి శనివారం ఎస్వీయూకు విచ్చేశారు. ఆమెకు వీసీ డాక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం మానవ, మహిళా హక్కులపై అనేక విషయాలు చర్చించారు. త్వరలో ఎస్వీయూ వేదికగా జాతీయ స్థాయి సదస్సు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆమె అధికారులకు తెలిపారు.

యామినీ కృష్ణమూర్తి మృతికి సంతాపం

తిరుమల : భరతనాట్య, కూచిపూడి నర్తకిగా ఖ్యాతిగాంచిన యామినీ కృష్ణమూర్తి మృతికి టీటీడీ అధికారులు, కళాకారులు సంతాపం ప్రకటించారు. యామినీ కృష్ణమూర్తి గతంలో టీటీడీ ఆస్థాన నర్తకిగా సేవలందించారు. ఆమె ఇక లేరన్న వార్త జీర్ణించుకోలేకపోతున్నామని పలువురు కళాకారులు తెలిపారు.

విద్యార్థులను ధృడంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు: విద్యార్థులను మానసికంగా, శారీరకంగా ధృడంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ శేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం డీవైఈఓ ప్రభాకర్‌రాజు అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు బాబు, సురేష్ పాల్గొన్నారు.

సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

పుత్తూరు డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.భక్తగోపాల్(శ్రీకాళహస్తి), మహిళా అధ్యక్షురాలుగా అమ్ములు(పిచ్చాటూరు), కార్యదర్శిగా ఎ.గోపీకృష్ణ (గొల్లపల్లి), కోశాధికారిగా ఎస్.ఎం.లోకనాథం (బీరకుప్పం) ఎన్నికయ్యారు.



మురిసేలా.. మైమరిచేలా..!

కనువిందు చేసే క్రోటన్స్.. అబ్బురపరిచే బోన్సాయ్.. సువాసనలు వెదజల్లే గులాబీలు.. ఆకర్షణీయమైన ఆర్కిడ్స్.. నోరూరించే ఫలాలను అందించే వివిధ రకాల మొక్కలు తిరుపతిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు నగర వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా పెద్దసంఖ్యలో నర్సరీలు వెలిశాయి. అరుదైన మొక్కలు సైతం ఇక్కడ లభిస్తున్నాయి. పెరటితోటల పెంపకంపై ఆసక్తిని ఇనుమడింపజేస్తున్నాయి. ఔషధగుణాలతో కూడిన మొక్కలు సైతం విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఎడారి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న జాతులు రారమ్మని పిలుస్తున్నాయి. ముఖ్యంగా రెండు చేతుల్లో ఇమిడిపోయే బోన్సాయ్ చెట్లు మరింతగా ఆకట్టుకుంటున్నాయి.

- ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆకట్టుకుంటున్న నర్సరీలు
- తిరుపతి నగరంలో సుమారు 20 మొక్కల విక్రయ కేంద్రాలు
- అందుబాటులో 100కు పైగా రకాలు
- కొనుగోలు ఆసక్తి చూపుతున్న ప్రజలు

తిరుపతి అలిపిరి : తిరుపతి నగర శివారుల్లో నర్సరీలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. లీలామహల్ నుంచి కరకంబాడి రోడ్డు, జూపార్కు, తిరుచానురు రోడ్డులోని శిల్పారామం, రేణిగుంట రోడ్డు, చెర్లోపల్లె ప్రాంతాలలో పదుల సంఖ్యలలో నర్సరీలు నగర వాసులను ఆకట్టుకుంటున్నాయి. ఇందులో ప్రధానంగా 100 రకాలకు పైగా మొక్కలు అందుబాటులో ఉన్నాయి. పెరటి మొక్కలు, ఔషధ మొక్కలు, భారీగా క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ఇంటి పెరట్లో, బాల్కనీలో పెంచుకోవడంతోపాటు మిద్దె తోటల ఆసక్తి ఉన్న మహిళలు అధికంగా నర్సరీల బాట పడుతున్నారు. దీంతో నర్సరీ నిర్వాహకుల ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది.

వంద రకాలకు పైగా..

తిరుపతి నగరం పరిధిలో సుమారు 20కి పైగా నర్సరీలు ఉన్నాయి బెంగళూరు, పూణే, రాజమండ్రి, హోస్‌కోట, తమిళనాడు ప్రాంతాల నుంచి నర్సరీ యజమానులు అత్యధికంగా మొక్కలను తీసుకువస్తున్నారు. వంద రకాల అరుదైన మొక్కలను నర్సరీల్లో ఉంచుతున్నారు. నర్సరీల్లో ప్రధానంగా బ్రహ్మకమలం, సింధూరం, పద్మకమలం, లక్ష్మీకమలం, కృష్ణకమలం, సన్సేరియా, గోల్డెన్ బారెల్ కాక్టస్, రాబిటర్ కాక్టస్, హోయా (లవ్ ఆకారం), పలు అలంకార ఎడారి మొక్కలతోపాటు బోన్సాయ్, ట్రీస్టెప్(లక్కీ బాంబో), గాలిని శుద్ధి చేసేటువంటి సింగోనియమ్, ఆగ్లోనిమా ఫ్యామిలీ , అరేఖ పామ్, వాటర్ మిలాన్ ప్రెప్రోమియా (అమెరికన్ రబ్బర్ ప్లాంట్), దేవగన్నేరు, రబ్బర్ లాంటి వివిధ రకాల మొక్కలు, అలాగే మాల్ఫీజియా ఫ్యామిలీ, ఫైకస్ ఫ్యామిలీ, పోతిస్ వెసిగేట మొక్కలు అందుబాటులో ఉంచారు. అలాగే రణపాల, ఇన్సులిన్, లెమన్ గ్రాస్, వామ్ ఆకు వంటి అయుర్వేద మొక్కల విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. అలాగే పండ్ల మొక్కలైన జామ, పనస, మామిడి, బేరి, బార్బ్‌స్ చెర్రీ, ఆపిల్, స్వీట్ లైన్, ఆరంజ్, వాటర్ ఆపిల్ (రెడ్) , వాటర్ ఆపిల్ (గ్రీన్), కివీ, లిచీ, ముంత మామిడి మొక్కలకు మంచి డిమాండు ఉంటోంది.

చక్కటి ఆదాయం



నేను ఒంగోలులో డిగ్రీ పూర్తి చేశా. నా భర్త సైతం గ్రాడ్యుయేషన్ చదివారు. కొన్నేళ్లుగా పలు ప్రాంతాల్లో నర్సరీలను నిర్వహించాం. ప్రస్తుతం ఆరు నెలలుగా తిరుపతిలో నర్సరీని నిర్వహిస్తున్నాం. తక్కువ ధరలకే వివిధ రకాల మొక్కలను విక్రయిస్తున్నాం. వంద రకాలకు పైగా మొక్కలను అందుబాటులో ఉంచాం. బెంగళూరు, పూణే, హోస్‌కోట, రాజమండ్రి ప్రాంతాల నుంచి మొక్కలను దిగుమతి చేసుకుంటున్నాం. మా వద్ద రూ.30 నుంచి రూ. 1000 పైగా మొక్కలు ఉన్నాయి. అలంకరణ, ఆయుర్వేద, పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచాం. నర్సరీ ద్వారా చక్కటి ఆదాయం పొందుతున్నాం.

– శైలజ, గిరి గార్డెన్ నర్సరీ నిర్వాహకులు, తిరుపతి

మొక్కలపై ప్రేమతోనే.. !



అమెరికాలో 20 ఏళ్లపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశా. కోవిడ్ కాలంలో ఇక్కడకు వచ్చేశాం. మొక్కలపై ప్రేమతోనే నర్సరీ నిర్వహిస్తున్నాం . నా భార్య సహకారంతో నర్సరీలో పనులు చూసుకుంటున్నాం. తక్కువ ధరకు మొక్కలను అందిస్తున్నాం. కూలీలు లేకుండా మా పని మేమే చేసుకుంటున్నాం. తక్కువ ఆదాయం వచ్చినా మొక్కలపై ఉన్న ప్రేమతో నడుపుతున్నాం. అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచాం. అలంకరణ మొక్కలు, ఎడారి మొక్కలతోపాటు వివిధ రకాల పండ్ల మొక్కలను సైతం విక్రయిస్తున్నాం.

– చింతల పురుషోత్తం రెడ్డి, బృందావనం నర్సరీ నిర్వాహకులు, తిరుపతి

మొక్కల పెంపకమంటే ఇష్టం



మొక్కలను పెంచడం నాకెంతో ఇష్టం. క్యాటరింగ్ నిర్వహిస్తూ కొన్నేళ్లపాటు తిరుపతిలోని అద్దె ఇంట్లో ఉన్నాం. అయినా మొక్కలపై ప్రేమతో వివిధ రకాల మొక్కలను పెంచుకున్నాం. ప్రస్తుతం సొంతంగా చిగురువాడ వద్ద సొంత ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు మరిన్ని మొక్కలను పెంచుకునేందుకు నర్సరీలో పలు అలంకరణ మొక్కలతో పాటు పండ్ల మొక్కలను కొనుగోలు చేశాం. ఇంటి బయట పెంచుతున్న మొక్కలతో ఎంతో ఆహ్లాదం కలుగుతుంది. మిద్దెపైన మొక్కలు పెంచుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– పి.ప్రకాష్, చిగురువాడ











వివిధ రకాల పూల మొక్కలు, విభిన్న ఆకృతుల్లో పోతీస్ వెసిగెటా మొక్కలు, బోన్సాయ్ చెట్లు, ఎడారి జాతి మొక్క, నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు

రుయా కార్మికుల మెరుపు ధర్నా



రుయా అధికారికి వినతిపత్రం అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు శనివారం పరిపాలనా భవనం ఎదుగ మెరుపు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నేతలు మురళి, కేతారి రాధాకృష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. కనీస వేతనాల అమలు, పనిభారం తగ్గించడం, కాంట్రాక్ట్ సంస్థ వేధింపులను అరికట్టడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ వన్ సర్వీసెస్ కాంట్రాక్ట్ సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వ ఖజానాని దోచుకుంటున్న సంస్థపై ఉదాసీన వైఖరి అవలంభించడం సరికాదని స్పష్టం చేశారు. రుయా అధికారులు మామూళ్ల మత్తులో మునిగి పోవడంతోనే కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 226 మంది పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి ఉండగా, 90 మందితో పనులు చేయిస్తున్నారని, మిగిలిన వారి వేతనాలను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి, కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోని పక్షంలో నిరవధిక సమ్మె తప్పదని స్పష్టం చేశారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారంపై రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. యూనియన్ నాయకులు రవి, పెంచలయ్య, విశ్వనాథ్, రాజాబాబు, మహేంద్ర, శ్రీనివాసులు, వెంకటేష్, కిషోర్, సురేష్, మీనా, ప్రమీల, పార్వతి పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిత

తిరుపతి కల్చరల్ : ఉన్నత విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్వీయూ వీసీ అప్పారావు తెలిపారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఇంటర్నేషనల్ క్యాంపస్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2024 సమ్మిట్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ అప్పారావు జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్‌ను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ విదేశీ యూనివర్సిటీలో ఉన్నత విద్య, ప్రవేశాలపై అవగాహన సదస్సును తిరుపతిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత తల్లిదండ్రులకు ఉన్నత చదువుపై అవగాహన కల్పిస్తే, వారు తమ పిల్లలను ఉన్నత చదువులతో పాటు మంచి ఉద్యోగాల్లో స్థిరపడేందుకు కారకులవుతారని తెలిపారు. ఐసీసీ డైరెక్టర్ నరసింహ ఆధ్వర్యంలో ఇలాంటి సమ్మిట్‌ను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ విద్యార్థులు మంచి నైపుణ్యత సాధించుకొని విదేశాల్లో వారి ఉద్యోగాల్లో సత్తా చాటుతారని వెల్లడించారు. ఐసీసీ డైరెక్టర్ నరసింహ మాట్లాడుతూ సంస్థ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారిని మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.



జ్యోతిప్రజ్వలనలో ఎస్వీయూ వీసీ అప్పారావు, మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని తదితరులు

నూతన విద్యార్థినులకు 'ఇండక్షన్'



యోగా చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కొత్తగా ప్రవేశాలు పొందిన తొలిఏడాది విద్యార్థినులకు శనివారం నుంచి మూడువారాల పాటు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యోగా, ధ్యానం, క్రీడలు, సంగీత నృత్య కార్యక్రమాలుపై అవగాహన కల్పించారు. అనంతరం వర్సిటీలోని లైబ్రరీ, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, ల్యాబ్‌లు, స్థానిక ల్యాండ్ మార్క్‌లను విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికార్జున, రమజ్యోతి, సుప్రియ పాల్గొన్నారు

అమ్మ పాలే అమృతం

భాకరాపేట : అమ్మ పాలు నవజాత శిశువుల పాలిట అమృతమని చిన్నగొట్టిగల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుహాసిని తెలిపారు. శనివారం ప్రాజెక్టు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. తల్లి పాలు ముద్దు–పోత పాలు వద్దు, అమ్మ పాలే ఆరోగ్యానికి మొదటి టీకా, ముర్రుపాలు పట్టండి–బిడ్డ ఆరోగ్యం కాపాడండి అంటూ అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలని సూచించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లను చేశారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చిరుధాన్య ఉత్పత్తుల మేళా



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులో రాస్ ప్రధాన కార్యాలయంలో చిరుధాన్య ఉత్పత్తులు, సేంద్రీయ ఉత్పత్తుల మేళాను శనివారం ప్రారంభించారు. రెండు రోజులపాటు ఈమేళా నిర్వహించనున్నారు. పెద్దసంఖ్యలో సందర్శకులు విచ్చేసి ప్రదర్శనలోని ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఈ మేళా ఆదివారం కూడా ఉంటుందని శాస్త్రవేత్త, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు వెల్లడించారు.

బంగ్లా నిర్మాణ పనులు వేగవంతం



నిర్మాణపనులు పరిశీలిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా : ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్మిస్తున్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బంగ్లా పనులను వేగవంతం చేయాలని మేయర్ శిరీష ఆదేశించారు. శనివారం ఈ మేరకు అధికారులు, గుత్తేదారులతో కలిసి బంగ్లా నిర్మాణ పనులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ మూడు నెలల్లోపు బంగ్లాను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. బంగ్లా చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ తేజస్విని పాల్గొన్నారు.

మారుతీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న పేషెంట్

తిరుపతి తుడా: స్థానిక బస్టాండు సమీపంలోని శ్రీమారుతీ హాస్పిటల్స్‌లో అతి క్లిష్టమైన బ్రాన్కో ఆర్ట్రీ ఎంబ్లాయిజేషన్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 65ఏళ్ల మహిళ దగ్గుతో రక్తస్రావం అవుతూ ఆస్పత్రికి వచ్చిందన్నారు. ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎంపీ నరసింహ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామని చెప్పారు. అనంతరం కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, రేడియాలజిస్ట్ నవీన్ పర్యవేక్షణలో విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశామని వెల్లడించారు.

వెటర్నరీ వర్సిటీలో ముగిసిన శిక్షణ

తిరుపతి సిటీ: జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులు–నివారణ చర్యలపై ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథులుగా అసోసియేట్ డీన్ జగపతిరామయ్య, వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, డాక్టర్ బి.శ్రీదేవి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా కక్షిదారుడు పి.విజయసింహా రెడ్డి, తండ్రి పి.నారాయణ రెడ్డి వారి సూచన మేరకు ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా సదరు నా కక్షిదారుడు ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిని సదరు షెడ్యూల్లు యజమాని అయిన బోయరెడ్డి గారి నాధముని రెడ్డి గారి కుమారుడు అయిన బి.వేణుగోపాల్ రెడ్డి, తిరుపతి వారి వద్ద నుండి కొనుగోలు నిమిత్తం రిజిష్టర్ విక్రయం 07-08-2024న చేసుకొనుచున్నారు. సదరు ఈ క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవ్వరికైనా అభ్యంతరములు కాని ఎలాంటి విక్రయ అగ్రిమెంటులు కాని కోర్టుల తగువులు కాని విక్రయం అడుమానం కాని, బ్యాంకు లోన్లు కాని, కోర్టు అటాచ్‌మెంట్స్ కాని, సివిల్ కేసులు కాని, లీజు, లైసెన్స్, అగ్రిమెంట్లు కాని మరియు ఇతర ఏలాంటి లావాదేవీలు ఉన్న ఎడల ఈ క్రింద కనబరచిన చిరునామాదారునికి తగిన ఆధారములతో ఈ ప్రకటన వెలువడిన 5 రోజులలోపు తగు ఆధారాలతో రిజిష్టరు పోస్టు కాని వాట్సప్ ద్వారా గాని తెలియజేయవలయును. గడువు రోజులలోపు రాని పక్షములో ఎటువంటి తగువులు లేవని నా కక్షిదారుడు సదరు భూయజమాని బోయరెడ్డి గారి వేణుగోపాల రెడ్డి వద్ద నుండి క్రయ అగ్రిమెంటు చేసుకొనెదను. గడువు తరువాత వచ్చు అభ్యంతరమునకు నా కక్షిదారునకు ఎటువంటి సంబంధం లేదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాను.

షెడ్యూలు : శ్రీ బాలాజి రిజిస్ట్రేషను జిల్లా, తిరుపతి సబ్ జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, మనుపు ముత్యాలరెడ్డిపల్లి గ్రామ పంచాయితీలో ఏరియాగా ఉండి ప్రస్తుతం తిరుపతి టౌన్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, 23వ వార్డుకు చేరిన, యస్.వి.నగర్‌లో, నెం.29రు, తిరుపతి గ్రామ లెక్కదాఖలా సర్కారు పుంజ సర్వేనెం. 305/2 లెటరు విస్తీర్ణం. ఎ.3.48 సెంట్లు, డోర్ నెం. 11-45(పోర్షు), 11-42 ఇండ్లు ఖాళీ స్థలం, డోర్ నెం. 11-43. డోర్ నెం. 23-11-43/బి మరియు 23-11-45/1 ఇండ్లు, షెడ్లు, ఖాళీ స్థలాలు - హద్దులు, తూర్పు : ఓ.వి.ఆర్. బిల్డింగ్స్, పడమర : రోడ్డు, ఉత్తరం : కె.దేవమనోరమ సొత్తులు, దక్షిణం : సివిల్ రోడ్డు మరియు ఇతరుల సొత్తులు. కొలతలు : తూర్పు - పడమర : 114 అడుగులు (ఉత్తరం వైపు), తూర్పు-పడమర : 114 అడుగులు (దక్షిణం వైపు), ఉత్తరం - దక్షిణం : 134 అడుగులు (తూర్పు వైపు), ఉత్తరం - దక్షిణం : 134 అడుగులు (పడమర వైపు) వెరసి మొత్తం విస్తీర్ణం : 14476 చదరపు అడుగులు.

పి. విజయసింహా రెడ్డి సెల్ : 93964 32131	బెరుకుల విజయ కుమార్ న్యాయవాది. సెల్ : 98495 23761

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యోగా శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బాలాజీకాలనీలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.సయ్యద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి యోగా చక్కని మార్గమని తెలిపారు. పిల్లలకు సూపర్ బ్రెయిన్ యోగా, బ్రెయిన్ జిమ్, స్పోర్ట్స్ యోగా నేర్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 99853 94350లో సంప్రదించాలని కోరారు.

తిరుచ్చిపై సీతారాముల విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అనుబంధంగా ఉన్న సీతారాముల వారు బంగారు తిరుచ్చిపై విహరించారు. శనివారం శ్రీరాముల వారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకార శోభితులైన సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

రఘునాథరెడ్డికి పరామర్శ



చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడుతున్న చెవిరెడ్డి

చంద్రగిరి : చంద్రగిరి ఉప సర్పంచ్ నగరి చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి రఘునాథరెడ్డిని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. శనివారం రాత్రి ఆయనను తిరుపతి స్విమ్స్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. సమాచారం అందుకున్న చెవిరెడ్డి వెంటనే స్విమ్స్‌కు చేరుకున్నారు. అత్యవసర విభాగంలో చికిత్స తీసుకుంటున్న రఘునాథరెడ్డి ఆరోగ్యస్థితిగతులపై వైద్యులను ఆరా తీశారు. అనంతరం ఆయన తనయుడు చంద్రశేఖర్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. రఘునాథరెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.